# వడ్ల చిలకలు

**సుతారంగా** కంటి అద్దాలు తీసి తెల్లటి రుమాలుతో తుడిచి అందమైన ఆమె కళ్ళకి తగిలించుకుంది అనుపమ ఛటర్జీ. చల్లటి గ్లాసు పలకమీది ఆకుపచ్చటి పెన్ తీసుకుని తెల్లటి ఆమె వేళ్ల మధ్య తిప్పుతూ అన్నదామె.

"ఏవంటారు, మీకిష్టమేనా?"

విశ్వనాథం నిజానికి ఆమె ప్రశ్న సరిగా వినలేదు. ఆమె చేతిలో పెన్ను ఒకసారి ముట్టుకోవాలనిపించిందతనికి. గది చల్లగా ఉన్నా అతనికి కాసేపు ఉక్కా కాసేపు చలిగానూ ఉంది. మాట్లాడాలని పించలేదతనికి. అలా సాయంత్రం వరకూ ముఖ్యంగా వచ్చీరాని తెలుగులో ఇంగ్లీషు పదాలు కలిపి కొంచెం ఆగుతూ, తల పంకిస్తూ నున్నటి కనుబొమ్మలు అర్థవంతంగా కదులుతూ ఆమె మాట్లాడుతూంటే వినాలని ఉందతనికి. ఆమె మాట్లాడు తున్నంతసేపూ అతని ఒంటిమీద సన్నజాజులు పడుతున్నట్టుంది.

"యస్?" అంది మళ్లీ.

విశ్వనాథం తల ఊపేడు. చక్కగా తెల్లగా నవ్వుతూ "గుడ్" అందామె. ఇంతలో బంట్రోతు టీ తెచ్చేడు. తీసుకోమన్నట్టుగా ఆమె చెయ్యి ఊపి కుర్చీలో వెనక్కి వాలింది. ప్రస్తుతం విశ్వనాథం ఆమె చేత్తో ఓ కప్పు సైనేడ్ ఇచ్చినా కాదనే స్థితిలో లేడు.

"ఐ యామ్ గ్లాడ్ యూ ఆర్ జాయినింగ్ దెమ్" అనుపమ మళ్లీ అన్నది. తాగే కప్పు టేబిలు మీద పెట్టి ఫైల్లో కాయితాలు వెతికి రెండు టైప్ చేసిన అరటావు కాయితాలు పైకి తీసింది. చదువుతూ, తల పంకిస్తూ అంది.

"రైట్. మీరు ఆరో నంబరు అవుతారు. తమిళనాడు నుంచి ఒకరు జాయినయ్యేరు"

తల మళ్లీ ఊపేడు విశ్వనాథం. కింది పెదవిని పంటికింద నొక్కుతూ భృకుటి ముడిచి ఆలోచనలో పడింది అనుపమ ఛటర్జీ. చంటి పిల్లాడు ఏడిచినట్టు ఫోన్ మోగింది. చిరు విసుగుతో ఫోన్ అందుకుందామె. తరువాతి అయిదు నిముషాలూ ఆమె 'ఊ' 'ఊ' అంటూ వింటూ ఉండిపోయింది. ఎడం చేతివేళ్లు టేబిలు మీద మెత్తగా దరువు వేస్తున్నాయి. ఆ చేతి వేలికి చిన్న కెంపు పొదిగిన సన్నటి ఉంగరం. సన్నటి పొడుగాటి వేళ్లకి ఎరుపు రాయి ముద్దొస్తోంది. విశ్వనాథానికి మాట పూర్తిగా పడిపోయింది.

"సరే, రమ్మని చెప్పండి" ఫోన్ పెట్టేసింది ఛటర్జీ సూటిగా విశ్వనాథం వేపు చూస్తూ, "వై డొన్ట్ యూ కమ్ టు మై ప్లేస్ దిస్ ఈవినింగ్, సే, అరౌండ్ సిక్స్?" అందామె.

"సరే మేడమ్"

నమస్కారం పెట్టి బైటపడి లూనా మీద రోడ్డుకి కనీసం అడుగు ఎత్తులో ఇంటికి చేరేడు విశ్వనాథం. ఇంటికి చేరడం మామూలు థర్మామీటర్లు చూపించలేని నూట ఆరు డిగ్రీల జ్వరంతో చేరేడతను. లోపలికి అడుగు పెట్టగానే విశ్వనాథం తండ్రి ఎదురయేడు.

"ఏమైందిరా?"

లోకంలోకి అడుగుపెట్టిన తరువాత మొట్టమొదటి మనిషిని చూసినట్టు చూశాడు వ్వినాథం. ఒక్క క్షణం ఆయన దేన్ని గురించి అడుగున్నాడో అర్థం గాలేదు.

"ఏం లాభం లేదందా? సుబ్బారావు మాట్లాడాతానన్నాడే" విశ్వనాథం తల్లి కూడా వచ్చి నుంచుంది.

"వాణ్ణి కాస్త ఊపిరి తీసుకోనివ్వండి రాగానే..." విశ్వనాథం కుర్చీలో కూచున్నాడు. ఎదుటి కుర్చీలో తండ్రి ఏం చెప్తాడోనని తల్లీ అతనివేపే చూస్తున్నారు.

"సాయంకాలం రమ్మన్నారు" అన్నాడతను.

"అంటే ఇస్తాననా, ఇవ్వననా? నువ్వు ఆవిడతో సరిగా మాట్లాడేవా అసలు?"

"ఆ"

"మరి సాయంత్రం ఏవిటి?"

"ఏమో, ఇంటికి రమ్మన్నారు"

వెంటనే ఆయన ముఖంలో నవ్వొచ్చి పడింది. భార్యవేపు చూస్తూ అన్నారాయన.

"కలక్టరు ఇంటికి రమ్మందంటే వీడికి ఇచ్చే ఉద్దేశం ఉందన్నమాట. ఏరా, నువ్వు బాగానే మాటాడేవా? సబ్ కలక్టరంటే రేపో మాపో కలక్టరవుతుంది ఏవనుకుంటున్నావో"

విశ్వనాథం నవ్వేడు; ఆమె జ్ఞాపకం వచ్చి.

"సరే. టంచనుగా ఆవిడ చెప్పిన టైముకి వెళ్లు. చెప్పులు బయట వదిలి లోపలికి వెళ్లాలి"

నిజానికి ఇప్పుడే వెళ్లి ఆమె బంగళా ముందున్న వేపచెట్టు కింద సాయంకాలం వరకూ కూచోవాల నుంది విశ్వనాథానికి. కొత్త జీవితానికి దారి చూపించిన దేవతలా తప్ప ఆమె మామూలు బెంగాలీ స్త్రీలా అతనికి కనిపించడం లేదు. ఆమె చిరునవ్వులో ఎంత హుందాతనం, వెలుగూ ఉన్నాయి. విశ్వనాథం తను చూసిన, బంధువుల స్త్రీలనందర్నీ

జ్ఞాపకం చేసుకుని పరిశీలించాడు. ఆవకాయబద్ద చీకడానికి తప్ప ఏ స్త్రీ మూతీ ఎందుకూ పనికిరాదనిపించింది.

"ఊ. ఇంకేవంది?"

"ఏవుంది మామూలే. నా సర్టిఫికెట్లు చూసింది. స్పోర్ట్సు గురించి అడిగింది. ఏదో అవే"

"ఇచ్చే ఏద్దేశం లేకపోతే అవన్నీ ఎందుకు మాటాడుతుందిలే. కలెక్టరంటే ఎంత పవరుంటుందో తెలుసా! ఇంకా ఇప్పుడు నయం. దొరలున్నప్పుడు కలెక్టర్లంటే మహారాజులన్నమాట. ఆ ఠీవీ, దర్జా. ఎంత భయభక్తులతో ఉండే వాళ్లం అనుకున్నావు? అగ్గగ్గలాడిపోయేవాళ్లం. బాగా పనిచేస్తే మెచ్చుకోలూ వుండేది. కాంప్‌బెల్ అని ఓ కలట్రుండేవాడు. వాడితో ఓసారి అన్నవరం కేంపుకెళ్లేం. మా అమ్మ మామూలుగా పెరుగూ అన్నం, ఒక ఆకులో దోసావకాయ పొట్లం కట్టి ఇచ్చింది. సరిగ్గా భోజనానికి కూచోబో తుండగా అలా ఒచ్చేడ్రా దొర. దొసావకాయ చూసి వాటీజ్ దిస్ అన్నాడు. పికిల్సార్ అన్నాన్నేను. కొంచెం. రుచి చూపించమన్నాడు. ఇహ తరవాత ఎంత మెచ్చుకున్నాడనుకున్నావు? కోటేశ్వర్రావు, ఇహ దొర నిన్ను వదల్డోయి అనేవాళ్లు మా వాళ్లంతా"

"ఆ దిక్కుమాలిన దోసావకాయ పురాణం కాపరానికి వచ్చినప్పటినుంచీ చెప్తూనే ఉన్నారు."

"నీ మొహం. అసలెప్పుడేనా దొర మొగం చూస్తే నీకు తెలుసుండేది"

కానీ విశ్వనాథం కోటేశ్వర్రావుగారి మాట ఒక్కటీ వినలేదు. అతని కళ్లముందు ఒక పెద్ద తులాభారం. ఒకవేపు నూట ఇరవై రెండు కాంప్‌బెల్లులు, మరోవేపు అనుపమ ఛటర్జీ కూచుని కనిపించారు. కలెక్టర్లు కూచున్నవేపు ఆకాశంలో వుంది. లుంగీ చుట్టుకుని వరండాలో మంచంమీద పడుకుని కళ్లు మూసుకున్నాడు విశ్వనాథం. అనుపమ మాటలు మంత్రంలా పనిచేస్తున్నాయని మీద.

కోటేశ్వర్రావుగారు తాలూకా ఆఫీసులో పని చెయ్యకపోయినా, ఆయన బాల్య స్నేహితుడి కొడుకు సబ్ కలెక్టరాఫీసులో పనిచెయ్యకపోయినా, నిన్న భార్య సాధింపు భరించలేక బజారుకెళ్లి అతన్ని కలవకపోయినా, విశ్వనాథం అలా నాలుగు లీటర్ల రెడ్ వైన్ తాగినట్టు మంచానికి అతుక్కుపోయేవాడు కాదు. నిన్న బజార్నించి చాలా వేగంగా ఒచ్చేడు కోటేశ్వర్రావుగ్గారు.

"వీడేడీ?" గుమ్మం లోంచే అడిగారాయన.

"నాకేవేనా చెప్పి వెడుతున్నాడా?"

విశ్వనాథం ఎనిమిదయ్యేసరికి ఇంటికొచ్చేడు. అతను బి.కాం మంచి మార్కులతో పాసయ్యాడు. ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభం అయ్యేయి. గత నాలుగు నెలల నుంచీ తండ్రి ప్రోత్సాహ సాధింపుతో టైపూ, షార్టుహాండూ నేర్చుకుంటున్నాడు. ఇంట్లోకి అడుగు పెడుతుండగానే ప్రారంభించారాయన. సబ్ కలెక్టరాఫీసులో కొన్ని తాత్కాలిక ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారట. ("సుబ్బారావు మనం గనక రహస్యంగా చెప్పేడు") ఆరునెల్లనుంచి ఏడాది వరకు ఉంటాయి ఉద్యోగాలు. ("పర్మనెంటూ అవొచ్చు") విశ్వనాథానికి పల్లేరుకాయ మింగినట్టనిపించింది. ఏ బేంకు ఉద్యోగవో, లేదా హైదరాబాద్‌లో ఏదో ఒక ఉద్యోగం సంపాయించి వెళ్లిపోదావని అతని ఆశ.

"రేపు మంచి రోజే. అప్లికేషన్ రాసి సబ్ కలెక్టరుగారి దగ్గరికెళ్లు. ఎవరో ఆడ కలెక్టరు. మళయాళీయో, బెంగాలీయో కాస్త జాగ్రత్తగా, తెలివిగా మాటాడిరా" తలూపి వెళ్లాడు విశ్వనాథం. మర్నాడు అప్లికేషను రాసి తండ్రికి ఏడుసార్లు చదివి వినిపించి ("ఐ రిమైన్ యువర్ మోస్ట్ ఒబీడియంట్ సర్వెంట్") మొత్తానికి స్వహస్తాలతో టైప్ చేసి పదకొండు గంటలకల్లా సబ్ కలెక్టరు ముందు హాజరయ్యాడు. తన పేరున్న చీటీ ఆమె వేళ్ల మధ్య రెపరెపలాడుతోంది. చిరునవ్వు నవ్వి కూచోమందామె. మూడు క్షణాల తరువాత అతను ఎందుకు వచ్చాడో సరిగా జ్ఞాపకం లేదతనికి. ఆమే జ్ఞాపకం చేసింది. అతని సర్టిఫికెట్లు చూస్తూ, బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ సర్టిఫికెట్ చూసి "ఐ సీ" అంది అనుపమ.

"బాస్కెట్‌బాల్ అంటే నాకు చాలా ఇష్టం" అందామె. తరువాత ఆ జిల్లాలో పేరున్న ఆటగాళ్ల వివరాలు అడిగింది.

"ఆమెతో చదువుకున్న ప్రేక్షకుల కంటే ఈ ప్రపంచంలో అదృష్టవంతులెవరూ లేరనిపించిందతనికి.

"ఓకే, లెట్స్ టాక్. మీకీ ఉద్యోగం అవసరమా?" అని ప్రారంభించి ఉద్యోగాల గురించీ, యువకుల ఆదర్శాల గురించీ చిరునవ్వుల నగిషీలు చెక్కిన వాక్యాలతో అనుపమ ఛటర్జీ మాట్లాడింది. విశ్వనాథం ముందు ఒక కొత్త ప్రపంచం ఆవిష్కరించిందామె.

"ఇటువంటి చిన్న ఉద్యోగంలో కూరుకుపోయేకంటే స్టేట్‌గానీ సెంట్రల్ సర్వీసెస్‌కి మీరు ఎందుకు ప్రయత్నించరు? మీలాంటి యువకులు ప్రభుత్వానికి అవసరం. నిజాయితీ, ఆదర్శాలు గల వ్యక్తులు ఇవాళ దేశానికి అవసరం. యూ మస్ట్ హేవ్ ఆంబిషన్. జీవితానికి ఒక ఐడియల్ ఉండాలి. అందులో మీరు స్పోర్ట్స్‌మన్ గదా. ఆ స్పిరిట్ ఆఫ్ కాంపిటీషన్ నిత్య జీవితంలో ఉండాలి. చిన్న ఒత్తిడికీ, కష్టాలకి లొంగిపోతే జీవితం ఏం కావాలి? ప్లీజ్ థింక్ అబౌట్ ద కంట్రీ ఆల్సో. మీకు కావలసిందల్లా ధైర్యం, ఆంబిషన్. ఏవంటారు?

కష్టపడితే మీరు సాధించగలరు. ఇట్ ఈజ్ లైక్ విన్నింగ్ ఎ గేమ్. వర్క్ హార్డ్ మిస్టర్ విశ్వనాథం. యూ కెన్ డూ ఇట్" విశ్వనాథానికి భుజాల్లోంచి రెక్కలు పుట్టుకొచ్చినట్టయింది. ఏవో విద్యుదయస్కాంత తరంగాలు అతన్ని భూకక్ష్యలోంచి వెలుపలికి లాగేశాయి. స్తోత్రం విన్న ఆంజనేయుడు లాగ అయిపోయాడు. ఎన్నడూ కలగనంత ఉత్తేజం కలిగిందతనికి. తండ్రిగానీ, పెదనాన్నగానీ, స్నేహితులుగానీ ఎవరూ ఎప్పుడూ అతనికి జీవితానికి సంబంధించిన ఈ మౌలిక అంశాల గురించి చెప్పలేదు. చిన్నప్పుడు దీపావళికి తిన్న ఉప్పుపొట్లం జ్ఞాపకం వచ్చిందతనికి. నిప్పురవ్వలు చిమ్ముతూ ఒక వలయాన్ని తనే ఏర్పరుచుకున్నాడు. జీవితానికి ఇన్ని రంగులుంటాయనిగానీ, మహత్తు ఉందని గానీ, అతనికి తెలీదు. ముఖ్యంగా తన జీవితాన్ని మలుచుకోవడంలో ఎవరి సహాయం అక్కర్లేదని తెలీడం గొప్ప ఆనందంగా ఉందతనికి.

"అఫ్‌కోర్స్" మీరు కాదంటే మీకీ ఉద్యోగం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఇట్స్ నో ప్రాబ్లమ్. కాని రెండు రోజులు ఆలోచించి ఒక నిర్ణయానికి రండి. ఎ హోల్ లైఫ్ ఈజ్ బిఫోర్ యు".

బలంగా తల ఊపేడు విశ్వనాథం.

"ఓహ్. ఐ ఫర్‌గాట్!"

"ఎక్సలెంట్. మంచి టైముకి వచ్చారు. మీకో గొప్పఅవకాశం ఇవ్వగలను." సొరుగులోంచి ఒక ఉత్తరం తీసి ఇచ్చిందామె. కేరళ నుంచి నలుగురు యువకులు మోటారు సైకిళ్ల మీద ఢిల్లీ వరకూ యాత్ర చేస్తున్నారు. దేశ సమైక్యత, మతసహనం యాత్ర ఆదర్శం. తమిళనాడులో ఒక యువకుడు కలుస్తున్నాడు. ఆంధ్రదేశం నుంచి ఎవరేనా చేరితే బాగుంటుందనీ, ఎప్పుడు వెనక్కి రావాలనిపించినా ఒచ్చేయ్యొచ్చనీ ఉత్తరం సారాంశం.

"ఏవంటారు? మీకిష్టమేనా?"

విశ్వనాథం తల ఊపేడు.

"గుడ్. ఇది గొప్ప అనుభం. దేశాన్ని చూడ్డం. అనేకమందిని కలుసుకోవడం, కష్టసుఖాలు తెలుసుకోవడం ఇదంతా మాటల్లో చెప్పలేని అనుభవం. మీరు జన్మలో ఈ అడ్వంచర్‌ని మర్చిపోలేరు. యూ విల్ ఫీల్ యూ బిలాంగ్‌టు ఎ బిగ్ గ్రేట్ కంట్రీ. ఈ వ్యత్యాసాలన్నీ పైకి కనబడేవే. అయితే మీకు వెహికల్, కొంత మనీ ఏర్పాటు చేస్తాను."

మధ్యలో ఎప్పుడో కునుకు పట్టింది. చటుక్కున మెలకువ వచ్చి చూస్తే మూడున్నర అయింది. విశ్వనాథానికి ఒళ్లు మండిపోయింది. ఇంక ఇవాళ సాయంత్రం అవుతుందని

నమ్మకం పోయిందతనికి. మొత్తానికి సూర్యుడికీ గొడవలు లేకపోవడంవల్ల ఆయన దారిన ఆయన పోగానే స్నానం చేసి చంకల్లో కొంచెం ఎక్కువ పౌడరు వేసుకుని రోడ్డు మీదనడిస్తే దుమ్మూ ధూళీ పడుతుందని రిక్షా ఎక్కి సబ్ కలెక్టరు బంగళాకి వెళ్లేడు విశ్వనాథం. చీకటి పడింది. పున్నాగపూలు అనుపమ చిరునవ్వు మల్లే కమ్మని వాసనలు వెదజల్లుతున్నాయి. పొడవాటి వరండాచివర తెల్లబట్టల్లో బంట్రోతు. ఎక్కడో పిట్ట అరుపు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. ట్యూబులైటు వెలుగులో, ఫానుకింద కాయితాలు చూసుకుంటోంది. అనుపమ. లోపలికి రాగానే మొగం తిరిగి పడిపోయినంత పనైంది విశ్వనాథానికి. కనకాంబరం రంగుచుడీదార్, దుపట్టా, తెలుపూ, ఎరుపూ కలిసిన పువ్వులాగుంది అనుపమ. గ్లాసెడు చల్లటి నీళ్లు తాగేడతను. అతను టీ తాగుతుండగా కాయితాలూ చూసేసి పక్కకి నెట్టి టీ కప్పు అందుకుందామె.

"సో?"

"నేను కూడా వెళ్తాను మేడం"

"గ్రేట్. ఐ విల్ మేక్ ది అరేంజ్‌మెంట్స్. మీరు మళ్లీ ఆఫీసులో ఒచ్చేవారం కలవండి"

"యస్. మేడం".

"ఓకే దెన్. ఐ థింక్ ఐ యామ్ టైర్డ్"

బయట పున్నాగ చెట్టుకింద కాసేపు నిలబడి గుండెనిండా తియ్యటి గాలి పీల్చుకుని రోడ్డు మీదకి నడిచేడు విశ్వనాథం. తిన్నగా పార్కుకి వెళ్లి బెంచీ మీద పడుకుని రెండు సిగరెట్లు కాల్చేడు. తను కష్టపడితే సబ్ కలెక్టరు కావడం ఖాయం.

విశ్వనాథం ఇంటికి చేరేసరికి 8.5 అయింది.

8.39 వరకూ కోటేశ్వర్రావుగారు దరిదాపు అపస్మారకర స్థితిలో కొడుకు మాటలు విన్నాడు.

8.41 కల్లా, ఇంట్లో బాగా దగ్గరివాళ్లు పోయిన వాతావరణం ఏర్పడింది.

9.22ని.ల నుంచీ 9.28 వరకూ కోటేశ్వంర్రాగారు కొడుకుని తిట్టేడు. ("ఇంక నువ్వు బాగుపడ్డం కల్ల")

ఆయన రెండు మెతుకులు తిని అన్నగారింటికి వెళ్లిపోయాడు.

"ఇలాచేసుకొచ్చేవేవిరా నాయనా?" అంది విశ్వనాథం తల్లి.

"నేనేం చేశానే? యాత్రలో వెళ్తే ఎంత మంచిదో నీకేం తెలుసు?" తల్లికి యాత్ర గురించీ, తన ఆశయాల గురించీ వివరించాడతను. అంతా విని అన్నదామె.

అవన్నీ మనకెందుకురా? ఎక్కడుంటావో, తిన్నావో, తిన్లేదో ఏ జరవో వస్తే చూసే దిక్కు ఉండదు. ఆ వెధవ సైకిళ్ల మీద అంతదూరం వెళ్లకపోతేనేం? కూటికా, గుడ్డకా?"

ఆమె కళ్లు వొత్తుకుంది.

"ఏదో కొంప మునిగిపోయినట్టు మాట్లాడతారేం? నేనేం దేశాలు పట్టి పోతున్నానా? నెల రోజుల్లో తిరిగొస్తాం"

"నీకేం నాయనా అలాగే ఉంటుంది. నాన్న పెద్దవారైపోయారు గదా. కడుపులో చల్ల కదలకుండా ఇక్కడే ఏదో చిన్నో, పెద్దో ఉద్యోగంచూసుకోవాలి గాని ఇదేం పన్రా నాయనా? ఉట్టి కెక్కలేనమ్మ సొర్గానికెక్కిందనీ, మరీ పెద్ద పోకడలు పోకూడదు. ఆవిడకేం ఎన్నేనా చెప్తుంది. ఎక్కడ ఉద్యోగం ఇవ్వాలో అవి నీకు బాగా నూరిపోసింది. నీకేనా తెలియాలా? ఇంకోళ్ల దగ్గిరయితే బాగా డబ్బు గుంజి నౌకరీ వేయిస్తుంది. ఆ హిందీ ముండల్ని నమ్మడానికి వీల్లేదు"

"హిందీగాదు, బెంగాలీ, అయినా ఆవిడ లంచాలు తినే బాపతు కాదు. నా మంచి గురించీ చెప్పింది. ఇష్ట లేకపోతే ఉద్యోగం ఇస్తానంది"

"ఆ ముక్క అందా? ఇంకేం, వెళ్లి ఉజ్జోగం ఇమ్మని అడక్క ఈ తిక్క మాటలు ఎందుకురా? నన్ను ఏడిపించకు నాయనా"

"అంటే నాకేం తెలియదంటావా?"

ఆలస్యంగాఒచ్చేరు కోటీశ్వర్రావుగారు. తల్లితో ఏదో గుసగుసలాడేరు.

మర్నాడంతా తండ్రీ కొడుకులు మాట్లాడుకోలేదు. కోటీశ్వర్రావుగారు వేడెక్కిన కారు ఇంజన్లా ఉన్నారు. విశ్వనాథం రెండు మెతుకులు తిని బయటికి పోయి బాగా పొద్దుపోయే వరకూ ఇంటికి రాలేదు. అతని ఉత్సాహం చాలా భాగం నీరుకారిపోయింది. సబ్ కలెక్టరు కావడం అంత సులభం కాదని తేలిపోయింది. మోటారు సైకిలు మీద దేశాన్ని చూసి పెద్ద విజేతలా వెనక్కి వచ్చి అనుపమా ఛటర్జీ చిరునవ్వు గెలుచుకుని ఐ.ఎ.ఎస్ రాద్దామనుకున్నాడు విశ్వనాథం. మొదటిసారిగా అతనికి జీవితంమీదరుచీ, కొత్త దృక్పథం ఏర్పడ్డాయి. ఇంట్లో గొడవలెందుకో అతనికి అర్థం కావడం లేదు.

రాత్రి ఇంటికి వచ్చేసరికి వరాండలో సిగరెట్టు కాలుస్తూ పెదనాన్న, సుబ్బారావు, తండ్రీ కనిపించేరు. క్షణంసేపు తటపటాయించాడు విశ్వనాథం. అతన్ని చూడగానే కేకేశాడు పెదనాన్న.

"ఏరోయి. దా, దా..."

"షికారెల్లి వచ్చావేవిటయ్యా?" అడిగేడు సుబ్బారావు. చూచాయిగా వ్యూహం తెలిసిపోయింది విశ్వనాథానికి. ఆ కబుర్లూ ఈ కబుర్లూ తప్ప అసలు విషయం ప్రస్తావించకపోవడంతో విశ్వనాథం కాస్త తేలిక పడ్డాడు. కాసేపటికి ఇపుడే వస్తా"నంటూ లోపలికి వెళ్ళేరు కోటీశ్వర్రావుగారు.

"ఊ. ఏవంటోందయ్యా మీ బాసు?" అన్నాడు సుబ్బారావు కాస్త ప్రాణవాయువు సోకినట్టయింది విశ్వానికి. విశ్వనాథం మాటలన్నీ ఓపిగ్గా విన్నారు ఇద్దరూ. మధ్యలో ఏవో అడుగుతూ, నవ్వుతూ విశ్వనాథాన్ని ఇంటి కక్ష్యలోకి తీసుకొచ్చేరు. కొత్త సిగరెట్ వెలిగిస్తూ "ఏవిటో సైకిల్ యాత్ర అంటాడేవిట్రా మీ నాన్న?" అన్నాడు పెదనాన్న.

ఉత్సాహంగా చెప్పేడు విశ్వనాథం. అంతే ఉత్సాహంగా విన్నారిద్దరూ. అంతా విని పెదనాన్న అడిగేడు.

"మరేం చేద్దామనుకుంటున్నావు?"

ఆయన తన పక్షం అని అర్థమైందతనికి. వెడదావనుకుంటున్నానన్నాడు. తల ఊపి, గంభీరంగా, అనునయంగా అరగంటసేపు మాట్లాడేడు పెదనాన్న.

"...నువ్వన్న దాంట్లో తప్పేవీ లేదు. కాస్త నాలుగు ఊళ్ళూ నీ వయసులోనే తిరగాలి. కలెక్టరవడం కంటే అదృష్టం ఏవుంది? ఒరే, నువ్వు కూడా నా కొడుకువే. అనుభవంతో చెప్తున్నాను అర్థంచేసుకో. పరిగెత్తి పాలు తాగేకంటే నుంచుని నీళ్లు తాగడం నయమని మన పెద్దలు ఎందుకున్నారంటావు? కొన్ని వింటానికి బావుంటాయి. ఆ సైకిల్ యాత్రలో మన ఖర్మగాలి ఏ ప్రమాదమో జరిగిందనుకో. మీ అమ్మ మనకి దక్కదు. నాన్నంటావా, గుండె రాయి చేసుకుంటాడు. కీడెంచి మేలెంచమన్నారు దేనికయినా, అవునా?" సుబ్బారావు అందుకున్నాడు.

"మరీ ఈ మధ్యరోడ్డు ప్రమాదాలు ఎక్కువైపోయాయి. వెధవలు తాగిలారీలు తోలడం, మనుషుల్నిచంపడం, పైగా ఆ హిందుస్తానీ లారీవాడయితే మరీ ఘోరం. గుద్దెయడం, వెళ్లిపోవడం. మన రాత బాగా లేకపోతే ఏం చెయ్యగలం? పైగా మెస్సూ, నానా నీళ్లే తాగి, అడ్డమైన తిళ్ళూ తినీ ఆరోగ్యం చెడితే ఇంకేమైనా ఉందా? నిన్ను ఏ గవర్నమెంటు ఆస్పత్రిలోనో పడేసి వాళ్లు చక్కా పోతారు. అంటే అలా జరుగుతుందని కాదు. అయినా, ఇహ టెలిగ్రాములూ, మీ నాన్న అక్కడికి పరిగెత్తి, పాపం ఈ వయసులో ఆయన్ని క్షోభపెట్టడం నీకేం సబబు?"

పెదనాన్న అన్నాడు.

"పెద్దవాణ్ణి. నే చెప్పేది జాగ్రత్తగా విని రాత్రి ఆలోచించు. మనకేం వుందిరా? మీ నాన్నా, నేను చిన్నతనంలోనే ఉద్యోగాల్లో ప్రవేశించి కష్టపడి సంసారాలు ఈదేం. పొలం పుట్రా? దేవుడుండబట్టి ఏదో చెరో కొంపా కట్టుకున్నాం. చదువులు చదివించేం. ఈ ఐ.ఏ.ఎస్‌లు అవీ మంచివే కావచ్చు. కానీ మనవెంతరా? కళ్లల్లోవత్తులు వేసుకుని చదివినా మన ఖర్మగాని రాలేదనుకో, తట్టుకోగలవా? పైగా కుర్రతనం, నీకు తెలీదు. ఈ పరీక్షలన్నీ శుద్ధ మోసం, ప్రతి పీనుగా లంచాలు మరిగి పేపర్లు అమ్మేసి పాసు చేయిస్తారు. ఈ లంచాలూ ఇవ్వలేం, ఆ మోసాలు చెయ్యలేం"

"కష్టపడి చదువుతాను" నసిగేడు విశ్వనాథం.

"నిజవే. కానీ మన రాత ఎలా వుందో. దాన్ని మార్చడం నీ వల్లా, నా వల్లా అవుతుందా? మీ నాన్నకి నువ్వంటే ప్రాణం. అందరికంటే చిన్నవాడివి గదురా. పాపం వాడు నువ్వేదో త్వరగా ఉద్యోగంలో చేరతావనీ, ఏదో మురుసుకుపోతున్నాడు. చిర్రుబుర్రు లాడతాడనుకోకు. వాడికి నువ్వంటే ఎంత ఆపేక్షో ఆలోచించరా?"

విశ్వనాథానికి దరిదాపు కళ్లు చెమర్చేయి. తండ్రికి తను ఏదో ద్రోహం తలపెట్టానన్న భావం మనసులో పడింది.

"ఉద్యోగంలో చేరి, ఒక్క నెల శెలవు పారేసి అలా కాశీ వరకూ సరదాగా వెళ్లిరా. ఎవడు కాదంటాడో చూస్తాను. నేను ఎక్కిస్తాను రైలు. సరే, పెళ్లి చేసుకుని పెళ్లాంతో వెళ్లావో మరీ బాగు"

"హనీమూన్" అన్నాడు సుబ్బారావు.

విశ్వనాథం సిగ్గుపడ్డాడు.

"ఒరే. ఆ ఉద్యోగంలో చేరు. కాళ్లూ కడుపులూ పట్టుకుని పర్మనెంటు చేయించే పూచీ నాది. హాయిగా, ఉన్నఊళ్లో ఉద్యోగం. ఏదో ఇల్లు ఉంది. మహారాజల్లే గడిచిపోతుంది. మన కుటుంబాల్లో కలిసిపోయే సంబంధం చూసి పెళ్లి నే బతికుండగానే చేసేస్తాను. నువ్వు రిటైరయ్యే నాటికి కొడుకులు అందివస్తారు. మనకి ఉన్నంతలో ఉండటం నేర్చుకోవాలి. అదీ. అసలు రేపు ఆదివారం అన్నవరం వెళ్లి స్వామివారికి జుట్టు ఇచ్చిరా. దరిద్రం వదిలిపోతుంది"

సుబ్బారావు నవ్వుతూ అన్నాడు.

"బాగాచెప్పేరు. దేవుడు తల్చుకుంటే ఇహనేం గావాలి. విస్సూ., నువ్వు నా చిన్న తమ్ముళ్లాంటి వాడివి. దేవుడిమీద ఒట్టేసి నీకు మాట ఇస్తున్నాను. నువ్వు ఉద్యోగంలో చేరు ఏడాది తిరక్కుండా పర్మనెంటు చేయిస్తాను. మాకా సులువులు తెలుసు కదా.

రెండో ఏడు తిరిగే సరికి నీ చేత స్థలం కొనిపిస్తాను. తరువాత నీకు ఓపిక ఉన్నపుడు నాలుగ్గదులు వేసుకో. అదీ. నా మాట మీద నమ్మకం ఉంది గదా. మా కలక్టరుగారు ఏదో చెప్తారు. దేశం గురించి నువ్వూ నేను ఏవీ చెయ్యలేం. పైగా వాళ్లు ఏ ఊరు వెడితే అక్కడి మాటలు చెప్తారు. అంతా షో. నీలాంటి అమాయకుడు పదిమందితో అంటాడా అనడా? ఆమె గారికి మంచి పేరొస్తుంది. ఇవన్నీ ఎన్ని చూశానంటావు?"

"బంగారంలాంటి మాటన్నావురా. వాళ్లకి అవన్నీ ట్రయినింగులోనే చెప్పి వెడతారు. లేకపోతే ముక్కూ మొగం తెలీని నీ మీద ఆమెకేవిటీ?" అన్నాడు పెదనాన్న.

మరో గంటసేపు ఉండి వెళ్లిపోయారు ఇద్దరూ.

రాత్రంతా విశ్వనాథం తల్లి ముక్కు ఎగపీలుస్తూ కళ్లు తుడుచుకుంటూనే ఉంది.

విశ్వనాథం ఉద్యోగంలో చేరేడు.

సుబ్బారావు స్థలం కొనిపించాడు.

ఆరేళ్ల తరువాత విశ్వనాథానికి కొంచెం పొట్ట వచ్చింది.

అప్పటికే పెళ్లయి రెండేళ్లు దాటింది. ఒక కూతురు.

అన్నవరం వెళ్లి గుండు గీయించుకున్నాడు.

ఇప్పుడతను మెల్లిగా నడుస్తాడు.

ఆఫీసు పన్లు మెల్లిగా చేస్తాడు.

మెల్లిగా మాటాడతాడు.

అతను ఉద్యోగంలో చేరిన ఏడాదే అనుపమ ఛటర్జీ బదిలీ అయి వెళ్లిపోయింది. రెండుఏళ్ల తరవాత ఆమె ఎవరో మళయాళీ చిత్రకారుణ్ని పెళ్లిచేసుకుందని తెలిసింది. టైపిస్టుతో అన్నాడు విశ్వనాథం.

"వీడెవడోగాని బంగారు బాతులాంటి పెళ్లాన్ని సంపాయించాడ్రా"

❖ ❖ ❖